ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

బుధవారం, 21 ఆగస్టు 2024 www.prajaaswaramdaily.com 2 PM

ఘోర రోడ్డు ప్రమాదం..
ఇద్దరు మృతి

హైదరాబాద్, ఆగస్టు 21 (ప్రజాస్వరం): రూరల్ మండలం మద్దులపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను వెనుక నుంచి బోలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన యువకుడిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.మృతుల వివరాలు తెలియాల్సి ఉంది

మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం
24 గంటల్లో నిందితుడి అరెస్టు

సిద్దిపేట, ఆగస్టు 21 (ప్రజాస్వరం): మూడేళ్ల చిన్నారిపై అత్యాచారానికి ఒడిగట్ట నిందితుడిని సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు ఒక రోజులోనే అరెస్టు చేసారు. త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్ కేసు వివరాలు తెలియపరుస్తూ. సిద్దిపేట పట్టణంలో నిర్మిస్తున్న అపార్ట్మెంట్లో నేపాల్ కు చెందిన వ్యక్తి వాచ్ మెన్ గా పని చేస్తూ తన భార్య, కొడుకు, కూతురు, మనవరాలితో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 19న అదే అపార్ట్మెంట్ నందు పెయింటింగ్ పని చేస్తున్న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం గోరఖ్ పూర్ జిల్లాకు చెందిన వ్యక్తి 3 సంవత్సరాల వయస్సు గల వాచ్ మెన్ మనుమరాలిని అడిస్తానని చెప్పి తన రూంలోకి తీసుకపోయి అత్యాచారం చేసాడు. పాప ఏడుస్తుండడంతో వాచ్ మెన్ వెళ్ళి చూసి మనవరాలిని ఎత్తుకొని వెంటనే పోలీసులకు సమాచారం అందించగా త్రీటౌన్ ఇన్స్పెక్టర్ మరియు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్ళి పూర్తి విచారణ జరిపారు. పాపను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి పంపించడం జరిగింది. సంఘటన విషయంలో కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించి కేసు పరిశోధనలో భాగంగా పై నిందితున్ని మంగళవారం పొన్నాల బ్రిడ్జ్ వద్ద పట్టుకున్నారు. చికిత్స పొందుతున్న పాప ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

ప్రభుత్వ నిర్లక్ష్యం.. ప్రజలకు
ప్రాణ సంకటం

విషజ్వరాలతో వణుకుతున్న రాష్ట్రం

- నిధులు శూన్యం.. పారిశుధ్య నిర్వహణ అధ్వానం
- పల్లె, పట్టణం తేడా లేకుండా జ్వరాల బారిన జనం
- మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్

హైదరాబాద్, ఆగస్టు 21 (ప్రజాస్వరం): డెంగీ, మలేరియా, గన్యా వంటి విషజ్వరాలతో రాష్ట్రం వణుకుతున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేకపోవడం శోచనీయం అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. డెంగీ జ్వరాల బారిన పడి 24 గంటల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం.. ప్రభుత్వ నిర్లక్ష్యం, రాష్ట్ర ప్రజలకు శాపంగా మారుతున్నది అని దుయ్యబట్టారు. ఇలాంటి పరిస్థితులు వస్తాయని ముందే ప్రభుత్వాన్ని హెచ్చరించామని, నిధులు విడుదల చేసి పారిశుధ్య నిర్వహణ కొనసాగించాలని, ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని వానాకాలం ప్రారంభంలోనే కోరామని అన్నారు. కానీ ప్రభుత్వం మా సూచనలను పెడచెవిన పెట్టిందని మండిపడ్డారు. సకాలంలో చర్యలు తీసుకొని ఉంటే విషజ్వరాలు ఇంతగా విజృంభించేవి కావు అని పేర్కొన్నారు. ఏటా వానాకాలం ప్రారంభంలోనే పారిశుధ్య చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఈ ప్రభుత్వం మొదటి నుంచి పూర్తి నిర్లక్ష్యం వహించిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయిలో ఒక్కనాడు కూడా సమీక్ష నిర్వహించ లేదన్నారు. దోమల నివారణకు గ్రామాలు, పట్టణాల్లో స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టలేదన్నారు. మరోవైపు పంచాయతీలకు నిధులు విడుదల చేయయపోవడంతో గ్రామాలు మురికికూపాలుగా మారుతున్నాయన్నారు. సొంత జేబుల నుంచి ఖర్చు చేస్తూ వచ్చిన పంచాయతీ కార్యదర్శులు ఇక తమ వల్ల కాదని సామూహికంగా సెలవులు పెడుతున్నారు, విధులకు దూరంగా ఉంటున్నారు అని హరీష్ రావు అన్నారు. ప్రభుత్వ సమీక్షలు లేక, నిధులు విడుదల చేయక, పారిశుధ్య నిర్వహణ జరగకపోవడంతో దోమలు విజృంభించి విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో జ్వరాల బారిన పడుతున్నారు. ప్రతి రెండు ఇండ్లలో ఒకరు వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. ఆసుపత్రుల్లో పడకలు దొరకని పరిస్థితి వచ్చిందంటే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు అని ధ్వజమెత్తారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించడం లేదన్నారు. పరిపాలనను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రాజకీయాలు చేయడం, ప్రతిపక్ష నాయకుల మీద బురద జల్లడానికే ప్రాధాన్యమిస్తున్నది అని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి పారిశుద్ధ్య నిర్వహణ, ఆసుపత్రుల సన్నద్ధత వంటి ముఖ్యమైన అంశాలపై తక్షణం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి వైరల్ ఫీవర్స్ బారిన పడి ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా చూడాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.

ఆ డబ్బులు అన్ని జిల్లాలకు అందించండి

భట్టికి హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 21 (ప్రజాస్వరం): పోలీసులకు సరెండర్, అడిషనల్ సరెండర్ లీవ్ బెనిఫిట్ కింద అందించే డబ్బులు అన్ని జిల్లాల ఉద్యోగులకు విడుదల చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను డిమాండ్ చేశారు. ఆ నిధులను కొన్ని జిల్లాలకే విడుదల చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ అకౌంట్లో ఓ పోస్ట్ చేశారు. "రాష్ట్రంలోని పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగులకు సరెండర్, అడిషనల్ సరెండర్ లీవ్ బెనిఫిట్ కింద అందించే డబ్బులు కొన్ని జిల్లాలకు మాత్రమే అందించి మరికొన్ని జిల్లాలకు అందించకపోవడం బాధాకరం. కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి సిద్దిపేట్‌లోని దాదాపు 6వేల మంది కానిస్టేబుల్‌ల సరెండర్, అడిషనల్ సరెండర్ లీవ్ బెనిఫిట్ గత ఎనిమిది నెలలుగా పెండింగ్లో పెట్టారు. పెట్రోల్, డీజిల్ బిల్లులు కూడా నెలల తరబడి చెల్లించకపోవడంతో పోలీసులు, పెట్రోల్ బంక్ యాజమాన్యం ఇబ్బందులు పడుతున్నారు. వీరి పట్ల ఎందుకంత వివక్ష.? రాష్ట్ర పోలీసులలో వీళ్ళు భాగం కాదా..? ఒకే డిపార్ట్మెంట్లో ఇంత పక్షపాతం ఎందుకు .? ఈ చర్యలు ముమ్మాటికీ వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమే. యూనిఫామ్ సర్వీస్ వాళ్లు కాబట్టి వాళ్లు బయటకు వచ్చి నిరసన తెలపలేకపోతున్నారు. వాళ్ళ సమస్యను నేను మీ దృష్టికి తెస్తున్నాను తక్షణమే పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నా"అని హరీశ్ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్ట్ చేశారు.

రుణమాఫీ..
గందరగోళం

కేంద్ర మంత్రి తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 21 (ప్రజాస్వరం) : ఇవాళ్టి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు ఉత్సవ్ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపట్టనుంది. దీనిలో భాగంగానే సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్స్ లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని కేంద్రమంత్రి తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీమతి విజయ రహత్కర్ హాజరవగా.. అభయ్ పాటిల్, చంద్రశేఖర్ తివారీ, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒక్క గ్రామంలో కూడా పూర్తి రుణమాఫీ కాలేదని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై సైతం కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పద్ధతిలోనే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలకు సీఎం రేవంత్ రెడ్డి తూట్లు పొడుస్తున్నారన్నారు. రైతు రుణమాఫీని రేవంత్ రెడ్డి గందరగోళంగా మార్చారని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. దేవుళ్ళపై ఒట్లు వేసిన సీరేవంత్ రెడ్డి మాట తప్పారని విమర్శించారు. రాష్ట్రంలో 50 శాతం రుణమాఫీ కూడా పూర్తి కాలేదని కిషన్ రెడ్డి తెలిపారు. రుణమాఫీపై పూర్తి వివరాలను ప్రజలు ముందు ప్రభుత్వం ఉంచాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రజా ఉద్యమాలకు సిద్ధం అవుతున్నామన్నారు. బీజేపీ.. వ్యక్తులు, కుటుంబాల కోసం నడిచే పార్టీ కాదని.. పండుగ వాతావరణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి రావటమే బీజేపీ లక్ష్యమన్నారు. బీజేపీ అధికారికంలోకి రావాలని ప్రజలే కోరుకుంటున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ ముక్తి దివస్ ను ఘనంగా నిర్వహిస్తామని కిషన్ రెడ్డి వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో సభ్యత నమోదులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కుటుంబాల కోసం అవినీతికి పాల్పడుతున్న పార్టీలను తరిమికొడతామన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీని మించిన ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ అని కిషన్ రెడ్డి తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు.

ఓటుకు నోటు కేసులో
చంద్రబాబుకు ఊరట

న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ప్రజాస్వరం): ఓటుకు నోటు కేసులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు భారీ ఊరట లభించింది. ఓటుకు నోటు కేసులో చంద్రబాబుని నిందితుడిగా చేర్చాలని, కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని వైసీపీ నేత ఆళ్లరామకృష్ణారెడ్డి వేసిన రెండు పిటిషన్లను ధర్మాసనం డిస్మిస్ చేసింది. రాజకీయ కక్ష్య సాధింపులకు న్యాయస్థానాన్ని వేదికగా చేర్చుకోవద్దంటూ పిటిషనర్ రామకృష్ణారెడ్డిని జస్టిస్ సుందరేశ్ ధర్మాసనం మందలించింది. ఆ మేరకు ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ అత్యున్నత న్యాయస్థానం తాజాగా తీర్పు వెలువరించింది.

ఇన్నేళ్ల తరువాత
ఇప్పుడు కూల్చివేతలా?

- హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు
- జన్వాడ ఫామ్ హౌస్ కూల్చివేతకు రేపటి వరకు బ్రేక్

హైదరాబాద్, ఆగస్టు 21 (ప్రజాస్వరం): జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ ప్రదీప్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. వాదనల సందర్భంగా హైడ్రాకు ఉన్న పరిధుల గురించి చెప్పాలని ఏఏజీకి ఉన్నత న్యాయస్థానం సూచించింది. ఈక్రమంలో హైడ్రా స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ అని ఏఏజీ పేర్కొన్నారు. మరోవైపు హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ప్రశ్నించింది. స్థల యజమానులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటారని తెలిపింది. స్థానిక సంస్థల అనుమతితో నిర్మాణాలు జరుగుతాయని పేర్కొంది. 15-20 ఏళ్ల తర్వాత హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణమంటూ కూల్చివేయడమేంటని న్యాయస్థానం ప్రశ్నించింది. మరోవైపు చెరువుల పరిరక్షణ కోసమే హైడ్రా ఏర్పాటైందని ఏఏజీ తెలిపారు. ప్రదీప్‌రెడ్డి వేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని చెప్పారు. జన్వాడలో ఉన్న ఫాంహౌస్ జీవో 111లోకి వస్తుందని పేర్కొన్నారు. కూల్చివేతల గురించి చర్చించాల్సి ఉందని హైకోర్టు తెలిపింది.

రేపటి వరకు ఏం చేయొద్దు

జన్వాడ ఫామ్ హౌస్ కూల్చివేతను గురువారం వరకు చేపట్టవద్దని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. జన్వాడ ఫాంహౌస్ ను కూల్చవద్దంటూ బీఆర్ ఎస్ నేత ప్రవీణ్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. హైడ్రా కూల్చకుండా స్టే ఇవ్వాలని న్యాయస్థానంలో ప్రవీణ్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈపిటిషన్ పై హైకోర్టులో విచారణ జరిగింది. హైడ్రా 111 జీవో పరిధిలోకి రాదని అడ్వకేట్ అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలియజేశారు. హైడ్రా పేరుతో హైడ్రామా క్రియేట్ చేస్తున్నారని పిటిషనర్ తరపున వాదనలు వినిపించారు. ఆగస్టు 14న కొంతమంది అధికారులు జన్వాడ ఫామ్ హౌస్ కు వచ్చి కూల్చివేస్తామని బెదిరించారని.. ఇందులో వాటర్ వర్క్స్ తో పాటు సివేజ్ బోర్డును పార్టీలుగా చేర్చలేదని పిటిషనర్ కోర్టుకు వెల్లడించారు. వాదనలు విన్న హైకోర్టు రేపటి (ఆగస్టు 22) వరకు జన్వాడ ఫామ్ హౌస్ కూల్చివేత చేపట్టవద్దని స్పష్టం చేసింది.

సహకరిస్తా : కేటీఆర్

అక్రమ నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తనకు ఏ ఇబ్బందీ లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తన పేరుమీద ఎలాంటి ఫాంహౌస్ లేదని చెప్పారు. తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పు తాను చేసినా, కాంగ్రెస్ వాళ్లు చేసిన చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. ''నా మిత్రుడికి ఉన్న ఫాంహౌస్ ను లీజుకు తీసుకున్నా. తప్పు ఉండి కూల్చివేస్తే నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఎఫ్ టీఎల్ , బఫర్ జోన్ లో ఉంటే నేనే కూల్చివేయిస్తా. మంచి జరుగుతున్నప్పుడు అందరం ఆహ్వానించాల్సిందే. మంత్రులు, కాంగ్రెస్ నేతలు కట్టిన ఫాంహౌస్ లు చూపిస్తా. మంత్రి పొంగులేటి, నేతలు కేవీపీ, పట్నం మహేందర్ రెడ్డి, సుఖేందర్ రెడ్డికి ఎఫ్ టీఎల్ పరిధిలో ఉన్నాయి. సీఎం రేవంత్ కు కూడా ఫాంహౌస్ ఉంది. తప్పు జరిగితే కూల్చివేతకు దగ్గరుండి సహకరిస్తా'' అని కేటీఆర్ అన్నారు.

రైల్వే కాంట్రాక్టర్ నిర్వాకం..
కూలిపోయేందుకు సిద్దంగా భవనం

మేడ్చల్, ఆగస్టు 21 (ప్రజాస్వరం): మేడ్చల్ పట్టణంలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఓ భవనం కుప్పకూలిపోయి ప్రమాదంలో ఉంది. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని గత 5 సంవత్సరాల నుండి గిర్మాపూర్ వెళ్లే దారి లో రైల్వే బ్రిడ్జి పనుల చేపట్టారు. గిర్మాపూర్ వెళ్లడానికి తాత్కాలికంగా అండర్ పాస్ రోడ్డు వేశారు. రైల్వే పనుల కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో దానికి పక్కనే ఉన్న జి ప్లస్ టు భవనం భారీ వర్షంతో వల్లన భవనం చుట్టుపక్కల ఉన్న మట్టి కొట్టుకుపోయింది. దీంతో ఉదయం మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నరసింహారెడ్డి ,మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి సందర్శించి భవనంలో ఉన్న వారందరిని ఖాళీ చేయించారు. ఏ క్షణమైనా భవనం కూలిపోతుందని చుట్టుపక్కల ఉన్న స్థానికులను అప్రమత్తం చేశారు.

కెమికల్ లోడులో గంజాయి స్మగ్లింగ్

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 21 (ప్రజాస్వరం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల పరిధి మందలపల్లి రాష్ట్రీయ రహదారి వద్ద ఒరిస్సా నుండి నాసిక్ కు తరలిస్తున్న గంజాయి ని పోలీసులు పట్టుకున్నారు. మహారాష్ట్ర నెంబర్ ప్లేట్ తో ఉన్న డిసిఎం వాహనంలో కెమికల్ లోడ్ లో కింద భాగంలో 275 ప్యాకెట్లలో 508 కేజీల గంజాయి ప్యాకెట్ లను ఉంచి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు, దమ్మపేట పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. నాసిక్ జిల్లాకు చెందిన 12 మంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి ఒడిస్సా నుండి నాసిక్ వరకు ఈ గంజాయి రవాణా చేస్తున్నారని, ఇలా తరలించిన గంజాయి ని పూణే ,ముంబై రాష్ట్రాలకు తరలిస్తున్నట్టు ప్రాథమిక విచారణలో తెలిసిందని, ఈ ముఠాలో ఆరుగురు వ్యక్తులను పట్టుకోగా మరో ఆరుగురు వ్యక్తులు పరారీలో ఉన్నట్టు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు.

కల్తీ కల్లు ఘటనలో ఒకరి మృతి

వికారాబాద్, ఆగస్టు 21 (ప్రజాస్వరం): వికారాబాద్ మండలం పీరంపల్లిలో విషాదం చోటు చేసుకుంది. మంగళవారం కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురయిన వారిలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించారు. దుర్గయ్య అనే వ్యక్తి కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురయ్యారు. వాంతులు.. విరోచనాలు కావడంతో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు పోందుతున్న దుర్గయ్య మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. మంగళవారం అస్వస్థతకు గురైన మిగతా వారందరూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు తీసుకొని బాగానే ఉన్నప్పటికీ దుర్గయ్య మృతితో అస్వస్థతకు గురైన వారిలో సైతం ఆందోళన మొదలైంది.